సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



అందని ద్రాక్షే..
దోమకొండ మండలకేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నా.. అత్యవసర వైద్య సేవలు అందడం లేదు.
- 8లో ▸



రోడ్డున పడ్డ చిరువ్యాపారులు
మెదక్‌నుంచి రుద్రూర్ వరకు జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులతో చిరు వ్యాపారులు రోడ్డున పడుతున్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
31.3 /21.3

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



ఎల్లారెడ్డి: వినాయక విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. శనివారం ఆమె ఎల్లారెడ్డిలోని పెద్ద చెరువు కట్ట వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేశ్ పాల్గొన్నారు.

నాగన్నగారి బావి పరిశీలన



లింగంపేట: మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిని రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనా రమేశ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 20న మెట్ల బావిని పర్యాటకుల సందర్శనార్థం అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి సురేందర్, ఎంపీడీవో నరేశ్, నాయకులు నారాగౌడ్, అశోక్, వినోద్ తదితరులున్నారు

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఫిజిక్స్, స్కూల్ స్థాయిలో ఫిజికల్ సైన్స్ పీజీటీ, టీజీటీ, ఇంగ్లిష్ పీజీటీ, మ్యాథ్స్ టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో గురుకుల పాఠశాలకు రావాలని సూచించారు.

సాక్షి ఇంటర్వ్యూ

డాక్టర్.. సబ్ కలెక్టర్



వైద్య విద్యనభ్యసించి పీజీ పూర్తి చేసి వైద్యరంగంలో స్థిరపడాల్సిన డాక్టరమ్మ.. సివిల్స్ వైపు అడుగులు వేశారు. వైఫల్యాలకు కుంగిపోకుండా పట్టుదలతో చదివారు. నాలుగో ప్రయత్నంలో ఉత్తమ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆమే డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి. ఆమె శిక్షణ పూర్తి చేసుకుని, ఇటీవలే బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. రోగుల నాడి పట్టి వైద్యం చేయాల్సిన డాక్టర్.. నిత్యం ప్రజల వద్దకు వెళ్తూ, సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.



నస్రుల్లాబాద్ జెడ్పీ హెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న సబ్ కలెక్టర్ (ఫైల్)

- ప్రజల నాడిపడుతున్న ఐఏఎస్ అధికారి
- విధుల్లో చేరిననాటినుంచే జనం బాట
- సమస్యలు తెలుసుకుంటూ.. వాటి పరిష్కారానికి కృషి
- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయితో 'సాక్షి' ఇంటర్వ్యూ

ఎస్.వేణుగోపాలచారి, సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా కిరణ్మయి పక్షం రోజుల క్రితం బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరిన నాటి నుంచే ఆమె నిత్యం ఊళ్లను చుట్టేస్తున్నారు. భారీ వర్షాలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఏర్పడిన సమస్యలను స్వయంగా వెళ్లి చూశారు. వారికి కావలసిన సాయం అందించారు. బాన్సువాడ గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని అనారోగ్యంతో చనిపోవడంతో చలించిపోయారు. పాఠశాలకు వెళ్లి సిబ్బందితో మాట్లాడి కారణాలను తెలుసుకున్నారు. స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి వారికి తగిన సూచనలు ఇస్తున్నారు. ఆమెను 'సాక్షి' ఇంటర్వ్యూ చేసింది. శిక్షణ, కుటుంబం, ప్రాధాన్యత తదితర అంశాల గురించి ఆమె మాటల్లోనే..

నా విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే జరిగింది. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివా. అక్కడే పీజీ పూర్తిచేశా. నా భర్త విజయ్‌కుమార్ సివిల్స్ సాధించాలని కష్టపడ్డారు. ప్రయత్నం ఫలించలేదు. ఆయన గ్రూప్–1 ద్వారా కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగంలో చేరారు. అయితే తాను సాధించలేని సివిల్స్ లక్ష్యాన్ని నా ముందుంచారు. మెడిసిన్ పీజీ కోసం అంత కష్టపడ్డావు, అలానే సివిల్స్‌కు సన్నద్ధం కావాలని సూచించారు. ఆయన కలను నిజం చేయడానికి మూడు పదుల వయసులో సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టా.

ప్రజల నుంచి నేర్చుకుంటున్నా..

సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రోజూ కొన్ని ప్రాంతాలలో తిరుగుతున్నాను. ప్రజలతో మాట్లాడినప్పుడు ఎన్నో విషయాలు తెలుస్తున్నాయి. ఎక్కడికి వెళ్లినా సమస్యలు చెబుతున్నారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపవచ్చు.. వెంటనే అధికారులు, సిబ్బందిని ఆదేశిస్తూ అలాంటి వాటికి పరిష్కారం చూపగలుగుతున్నాను. మిగతా వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నా.

మూడుసార్లు విఫలమయ్యా

ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో ప్రయత్నం మొదలుపెట్టా. మొదటి ప్రయత్నంలో 573వ ర్యాంక్ వచ్చింది. అప్పుడనిపించింది ఇంకొంత కష్టపడితే ఐఏఎస్ అవ్వొచ్చు అని.. రెండో ప్రయత్నంలో ర్యాంక్ 633వ వచ్చింది. కొంత నిరుత్సాహానికి గురయ్యా. అయితే ఢిల్లీ, అండమాన్ నికోబార్ దీవుల సివిల్ సర్వీసెస్ (డానిక్స్)లో చేరా. అక్కడ శిక్షణ పొందుతూ మూడోసారి ప్రయత్నించా. ఈసారి ప్రిలిమ్స్‌నూ దాటలేకపోయా.

నాలుగో ప్రయత్నంలో సక్సెస్..

ఎంత కష్టపడ్డా సివిల్స్‌కు సెలెక్ట్ కాకపోవడంతో కొంత నిరుత్సాహానికి గురయ్యా. కానీ కుంగిపోలేదు. లక్ష్యాన్ని చేరుకోవడానికి మరింత కష్టపడాలని నిర్ణయించుకున్నా. డానిక్స్‌లో శిక్షణను వదిలేసి హైదరాబాద్‌కు వచ్చా. అయితే ఇంట్లో ఉండకుండా హాస్టల్‌లో ఉండి చదువుకున్నా. మూడో ప్రయత్నంలో ప్రిలిమ్స్‌ను అధిగమించకపోవడంతో నాలుగో ప్రయత్నానికి కాస్త ఎక్కువ సమయం దొరికింది. హాస్టల్‌లో ఉండి కోచింగ్ తీసుకుంటూ, లైబ్రరీకి వెళ్లి చదువుకున్నా. నా కష్టం ఫలించింది. 2021 సంవత్సరంలో నాలుగో ప్రయత్నంలో 56వ ర్యాంకు వచ్చింది. మొదట్లో డాక్టర్‌గా మంచి లైఫ్ వదిలి సివిల్స్ ఎందుకన్న వారంతా.. ఐఏఎస్‌కు ఎంపికయ్యాక అభినందించారు. వైఫల్యాలకు కుంగిపోకుండా కసితో చదివి లక్ష్యాన్ని చేరుకోగలిగాను.

విద్య, వైద్యానికి ప్రాధాన్యత

నాణ్యమైన విద్య అందినప్పుడు పిల్లలు ఉన్నతంగా ఎదుగుతారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు మంచి విద్య అందడం కోసం నా వంతు ప్రయత్నాలు చేస్తా. ఊళ్లకు వెళ్లినప్పుడు స్కూళ్లను విజిట్ చేసి పిల్లలు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్నాను. అలాగే ఒక డాక్టర్‌గా ప్రజల ఆరోగ్యం విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాలని అనుకుంటున్నాను. ప్రజలకు మెరుగైన వైద్యం అందాలి. అందుకోసం ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలి. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తా. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

పాపను చాలా మిస్ అయ్యా..

పాపను అమ్మానాన్న, భర్త వద్ద వదిలేసి ఢిల్లీకి వెళ్లి సివిల్స్‌కు సన్నద్ధమయ్యా. పాపతో గడపాలని ఉన్నా ఐఏఎస్ సాధించాలన్న లక్ష్యాన్ని సాధించడం కోసం కొన్నాళ్లు దూరమవ్వాల్సి వచ్చింది. ఆమెను చాలా మిస్ అయ్యాను. ఫోన్‌లో మాట్లాడి తృప్తి పడేదాన్ని. పాప ప్రస్తుతం ఐదో తరగతి చదువుతోంది. హైదరాబాద్‌లో వాళ్ల నాన్న వద్ద ఉండి చదువుకుంటోంది. పదకొండు నెలల బాబు నా వద్ద ఉంటున్నాడు. మా అమ్మానాన్న ఇక్కడే ఉండి బాబును చూసుకుంటున్నారు.



దోంగ్లీలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కిరణ్మయి (ఫైల్)

అట్టహాసంగా సౌత్‌జోన్ సైక్లింగ్ టోర్నీ

- క్రీడాభివృద్ధి కోసమే ఖేలో ఇండియా : ఎంపీ అర్వింద్
- జెండా ఊపి పోటీలను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే ధన్‌పాల్
- నేడు ముగింపు వేడుకలు




సైక్లింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ అర్వింద్

నిజామాబాద్ నాగారం: నగరంలో ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ రోడ్ సౌత్‌జోన్ టోర్నమెంట్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి భూలోకం విజయకాంత్‌రావు ఆధ్వర్యంలో కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మహిళల క్రీడాభివృద్ధికి ఖేలో ఇండియా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాల నుంచి 300 మందికి పైగా బాలికలు, మహిళలు సైక్లింగ్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సౌత్ జోన్ సైక్లింగ్ పోటీలు నిజామాబాద్‌లో నిర్వహించడం గర్వకారణమని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తు అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఆదివారం కూడా టోర్నీ కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ నిషావిద్యార్థి, సైక్లింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీ కృపాకర్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్‌సుబేదార్, నర్సింగ్‌రావు, సూర్యప్రకాష్, వెంకట్ నర్సయ్య, ఎమ్‌కే పాషా తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..
సైక్లింగ్ పోటీల్లో సబ్ జూనియర్ బాలిక విభాగంలో కర్ణాటకకు చెందిన కోల్కా చావన్ బంగారు పథకం, దీపిక ఫెడరేట్ రజతం, జ్యోతి రాథోడ్ కాంస్యం సాధించారు. జూనియర్ విభాగంలో పాయల్‌చావన్ పసిడి, కీర్తి నాయక రజతం, అయేషమోమిన్ కాంస్య పతకాలు గెలుపొందారు. సీనియర్ మహిళా విభాగంలో నంద చిన్‌చకాండీ పసిడి పతకం, దానమ్మగౌవర్ రజతం, అక్షత భూతనాల్ కాంస్య పతకాలు సాధించారు.

నవరాత్రుల జాతర



జిల్లాకేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మండపాల వద్ద భారీ సెట్టింగ్‌లు వేశారు. మండపాలలో కొలువైన గణపయ్యను చూడడానికి భక్తులు తరలివస్తున్నారు. మండపాల వద్ద దుకాణాలూ వెలవడంతో జాతర వాతావరణం నెలకొంది.
– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



జిల్లాకేంద్రంలోని వినాయక మండపాల వద్ద రద్దీ

నిజాంసాగరం.. అయ్యేనా పర్యాటకం

- దూరప్రాంతాల నుంచీ వస్తున్న పర్యాటకులు
- ప్రాజెక్టు వద్ద కనీస వసతులు లేక ఇబ్బందులు
- పట్టించుకోని ప్రభుత్వం



నిజాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న ఛత్రీబంగ్లా

నిజాంసాగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయినిగా పేరున్న నిజాంసాగర్ ప్రాజెక్టు.. పర్యాటకుల మనసులు దోచేస్తోంది. నిత్యం వందలాది మంది ప్రాజెక్టు అందాలను చూడడానికి వస్తుంటారు. గేట్లు ఎత్తిన సమయంలో జనసంద్రంలా మారుతుంది. అయితే పాలకుల చిన్నచూపుతో ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందడం లేదు.

మంజీర నదిపై 1923 సంవత్సరంలో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రధాన చీఫ్ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజంగ్ బహదూర్ పర్యవేక్షణలో 1931 నాటికి నిర్మాణం పూర్తయ్యింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 2.75 లక్షల ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేయడంతోపాటు నిజామాబాద్, బోధన్, బాన్సువాడ పట్టణ ప్రజల దాహార్తిని తీరుస్తోంది. 'ఎస్' ఆకారంలో నిర్మించిన ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు). ప్రాజెక్టు వద్ద గుల్‌దస్తా, ఛత్రీ బంగ్లా, వాటర్ ఫౌంటెయిన్లు, సమ్మర్ బాగ్, స్విమ్మింగ్ పూల్, గోల్ బంగ్లా, బోటింగ్ తదితర సదుపాయాలు కల్పించారు. అంతే కాకుండా ప్రధాన ఇంజినీర్లతో పాటు అతిథుల విడిది కోసం గెస్ట్‌హౌస్, రెస్ట్‌హౌస్‌లను సైతం అప్పట్లోనే నిర్మించారు.

పాలకుల నిర్లక్ష్యం
ప్రాజెక్టును చూడడానికి ఉమ్మడి జిల్లావాసులే కాకుండా ఇతర జిల్లాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలనుంచి కూడా ప్రజలు వస్తుంటారు. అయితే ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో వారంతా ఇబ్బందిపడుతున్నారు. ప్రాజెక్టు వద్ద కనీసం మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేవు. తాగునీరు కూడా లభించని పరిస్థితులున్నాయి. పాలకుల నిర్లక్ష్యంతో పర్యాటకులు ఇబ్బందిపడుతున్నారు.

హామీలు నెరవేరేనా?
నిజాంసాగర్ ప్రాజెక్టును పర్యాటకంగా తీర్చిదిద్దుతామని పాలకులు చెబుతున్నా.. ఆ మాటలు ఆచరణ రూపం దాల్చడం లేదు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిజాంసాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సర్వే చేయించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసరాల్లో 500 ఎకరాల స్థలాన్ని సర్వే అధికారులు గుర్తించారు. వైఎస్సార్ మరణానంతరం దానిని పట్టించుకునే వారు కరువయ్యారు. నిజాంసాగర్‌ను బృందావనంలా మారుస్తామని గత పాలకులు హామీ ఇచ్చారు. కానీ పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పాలకులు స్పందించి నిజాంసాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కూడా లేవు



నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో చూడడానికి వచ్చాం. ఇక్కడి పరిసరాలు, అందమైన కట్టడాలు కనువిందు చేస్తున్నాయి. కానీ కనీస సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులంతా ఇబ్బందిపడుతున్నారు. సౌకర్యాలు కల్పించాలి.
– భాగ్యలక్ష్మి, పర్యాటకురాలు, ఎల్లారెడ్డి

అభివృద్ధి చేయాలి



ప్రాజెక్టు వద్ద ప్రకృతి రమణీయత కట్టిపడేస్తుంది. ఎంత చూసినా తనివి తీరదు. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అనుకూలంగా ఉంది. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశాలుంటాయి.
– నరేశ్, పర్యాటకుడు, ఎల్లారెడ్డి



గుల్‌దస్తా గార్డెన్



గుల్‌దస్తా వద్ద వృథాగా ఉన్న ఫౌంటెయిన్

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

దోమకొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం దోమకొండలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే కరాటే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలలో ఉమ్మడి జిల్లానుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన 90 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 45 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్, 45 మందికి సిల్వర్ మెడల్ సాధించారని కరాటే గ్రాండ్ మాస్టర్ రాజయ్య తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, నిజామాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఈశ్వర్, జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నరసింహారెడ్డి, జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సాయి మోర్య, పీఈటీలు శ్రీధర్, కమిటీ మెంబర్ శ్రీరేఖ, నాగరాజు, ఉదయ, సతీష్, రఘురాం పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో క్రీడా సంఘాల ప్రతినిధులు

క్లుప్తంగా

పరుగు పందెంలో ప్రతిభ



రుద్రూర్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెంలో వి శ్రీహరి ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచాడు. కోటగిరి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కళాశాలలో శ్రీహరి ఎంపీసీ సెకండియర్ చదువుతున్నాడని ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక సౌత్ జోన్ స్టేట్ లెవల్ మీట్‌కు ఎంపికయ్యాడని, శ్రీహరి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రీహరిని ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి సంజీవ్‌కుమార్, సిబ్బంది అభినందించారు.

నేడు వైన్‌షాపులు బంద్

ఖలీల్‌వాడి: గణేశ్ నిమజ్జన వేడుకల సందర్భంగా జిల్లాలోని వైన్ షాపులు, బార్‌లు, కల్లు దుకాణాలను ఆదివారం బంద్ చేయాలని సీపీ కల్మేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఆదివారం ఉదయం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని బంద్ చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: మిలాద్–ఉన్–నబీ నేపథ్యంలో నిజామాబాద్ నగరంలో సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు పలురూట్లలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు సీపీ కల్మేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ వైపు నుంచి వచ్చే వాహనాలు అర్సపల్లి చౌరస్తా, అర్సపల్లి రైల్వే గేట్, న్యూ కలెక్టరేట్, కాలూర్ చౌరస్తా, ఖాజా హోటల్, బైపాస్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాలని, బోధన్ వైపు వెళ్లే వాహనాలు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే ఫ్లై ఓవర్, శివాజీచౌక్ , నిజాం కాలనీ, అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా బోధన్ వైపు వెళ్లాలని సూచించారు. నగర ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

పేకాటస్థావరంపై దాడి

వేల్పూర్: మండల కేంద్రంలోని రామమందిరం గణేశ్ మండపంలో పేకాట ఆడుతున్న 13 మందిని శుక్రవారం అర్ధరాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై నాగ్‌నాథ్ శనివారం తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.70 వేల నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అత్యవసర వైద్యం..అందని ద్రాక్షే

- ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత
- ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్న వైనం
- సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న రోగులు



దోమకొండలోని 30 పడకల క్లస్టర్ ఆస్పత్రి

దోమకొండ: అత్యవసర వైద్యం అందని ద్రాక్షగా మారింది. దోమకొండ మండల కేంద్రంలో 30 పడకల క్లస్టర్ ఆస్పత్రి ఉన్నా సేవలు మాత్రం అందడం లేదు. వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా రోగులు అత్యవసర సేవల కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 2008లో రూ.1.96 కోట్లతో 30 పడకల ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. 2010లో అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దానం నాగేందర్ దీనిని ప్రారంభించారు. పేరుకు 30 పడకల ఆస్పత్రి కానీ రోగులకు మాత్రం సేవలు అందడం లేదు.

11 మంది ఉండాల్సిన చోట..ఏడుగురే

దోమకొండలోని ప్రభుత్వ క్లస్టర్ ఆస్పత్రిలో మొత్తం 11 మంది వైద్యులు ఉండాలి. కాని ప్రస్తుతం ముగ్గురు రెగ్యులర్ వైద్యులు ఉండగా, మరో నలుగురు కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. 24 గంటల పాటు వైద్యసేవలు అందాల్సి ఉండగా, మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. ప్రస్తుతం ఉన్న స్టాఫ్‌నర్సులు కూడా ఇటీవల బదిలీల్లో వెళ్లగా వారి స్థానంలో కొత్త వారు రాలేదు. ఫార్మాసిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది. రేడియోగ్రాఫర్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. డార్క్‌రూం అసిస్టెంట్ పోస్టులు రెండు ఉండగా, రెండు పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. ఒకరు కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండగా అత్యవసర సేవల కోసం వచ్చిన వారిని జిల్లా కేంద్రంలోని ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. వైద్యుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది సైతం విధులకు సరిగా రావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి ఆస్పత్రిలో మండలంలోని గ్రామాలతో పాటు భిక్కనూరు మండలం కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, కంచర్ల, మాచారెడ్డి మండలం ఎల్పుగొండ, వాడి, ఫరీద్‌పేట గ్రామాలకు చెందిన వారు కూడా వస్తుంటారు. ఇకనైనా జిల్లా అధికారులు, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ స్పందించి వైద్యులను, వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

మధ్యాహ్నం వైద్యులు ఉండరు

ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉంది. 24 గంటల పాటు ఇక్కడి క్లస్టర్ ఆస్పత్రిలో సేవలు అందించాలి. కాని మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రికి వెళ్తే వైద్యులు ఉండరు. దీంతో కామారెడ్డి ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

– రాజనర్సాగౌడ్, దోమకొండ

వైద్యుల భర్తీకి చర్యలు

దోమకొండలోని 30 పడకల క్లస్టర్ ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్న మాట వాస్తవమే. దీనిపై అధికారులకు నివేదిక ఇచ్చాం. వైద్యులు భర్తీ అయ్యేలా, 24 గంటల పాటు సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

–విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్, కామారెడ్డి

సాయి సేవలో భక్తజన మండలి సభ్యులు



షిరిడీలోని సాయి ఆలయంలో కీర్తనలు ఆలపించిన భజన మండలి సభ్యులు



సభ్యులను సన్మానిస్తున్న సంస్థాన్ బాధ్యులు

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ షిరిడి సాయి భక్తజన మండలి సభ్యులు సాయిబాబా సేవలో తరిస్తున్నారు. ఈ భక్తజన మండలి 2022 మార్చి12న ఏర్పాటయ్యింది. రెండేళ్లుగా మండలి సభ్యులు గ్రామగ్రామాన ప్రతి ఇంటికి సాయి నామస్మరణ చేరేవిధంగా భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు వంద భజన కార్యక్రమాలు పూర్తి చేశారు. శతాబ్ది వేడుకగా 100వ భజన కీర్తన కార్యక్రమాన్ని ఇటీవల సాయి బాబా సన్నిధిన మహారాష్ట్రలోని షిరిడి పుర వీధుల్లో నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయినాథుని చరిత్రను ఆలపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తజనులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షిరిడి సంస్థాన్ వారు భక్తజన మండలి సభ్యులను ఘనంగా సన్మానించారు. షిరిడి సంస్థాన్ వారి సత్కారం తమ జీవితాల్లో మరుపురాని ఘట్టమని భక్తజన మండలి ప్రధాన కార్యదర్శి వై స్వరూప రాణి పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపిక



ఎంపికైన జిల్లా క్రికెట్ జట్టు

నిజామాబాద్‌నాగారం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయికి అండర్–19 విభాగంలో బాలుర జట్టు ఎంపికలను జీజీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చంద్రసేన్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌రెడ్డి సమక్షంలో ఎంపిక పోటీలు నిర్వహించి 25మందితో కూడిన ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేశారు. నాలుగు రోజులు శిక్షణ అనంతరం 15మందితో కూడిన తుది జాబితాను ఎంపిక చేసి వరంగల్‌లో నిర్వహించే టోర్నమెంట్‌కు పంపిస్తామని తెలిపారు. కోశాధికారి శ్రీనివాస్, కోచ్‌లు సురేశ్, పారస్, నయూమ్ తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ లీక్.. వ్యాపించిన మంటలు



మంటలను ఆర్పుతున్న కానిస్టేబుల్ నదీమ్

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన మమ్మద్ రహీం శనివారం తన ఇంటిలోని మొదటి అంతస్తులో వంట చేస్తుండగా వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో రహీం కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ మహ్మద్ నదీం ధైర్యంగా ముందుకెళ్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదం తప్పడంతో చుట్టుపక్కల దుకాణదారులు ఊపిరి పీల్చుకున్నారు. మద్నూర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఫ్రిజ్ ఇతర వస్తువులు కాలిపోయాయి సుమారుగా లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు మహ్మద్ రహీం తెలిపారు.

మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్



సుభాష్‌నగర్: డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతులకు రుణమాఫీ చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా సాంకేతిక సమస్యల కారణంగా సహకార సంఘాల్లో రుణమాఫీ వర్తించని రైతులకు కూడా మాఫీ అయ్యేలా చూడాలని మంత్రికి విన్నవించారు. రుణమాఫీ అయ్యేలా చూస్తామని మంత్రి హామీనిచ్చారని డీసీసీబీ చైర్మన్ తెలిపారు.

జిల్లా అథ్లెటిక్స్‌లో దోమకొండ క్రీడాకారిణులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థినులు

దోమకొండ: కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో దోమకొండ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొని పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సంగీత శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన నియతి షాట్‌పుట్ అండర్–20 విభాగంలో వెండి పతకం సాధించారన్నారు. అమెతో పాటు ఉష, సరితలు కూడా ఉత్తమ ప్రతిభతో పతకాలు సాధించినట్లు ఆమె వివరించారు. వీరిని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఉపాధ్యాయినులు స్వర్ణలత, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

రూ.33 లక్షల విలువైన అల్ప్రాజోలం పట్టివేత

- ముగ్గురి అరెస్ట్, పరారీలో మరొకరు



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితులు

కామారెడ్డి క్రైం: కల్తీ కల్లు తయారు చేసేందుకు ఉపయోగించే 3.340 కిలోల అల్ప్రాజోలం మత్తుమందును అక్రమంగా తరలిస్తున్న ఓ ముఠాను నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.33 లక్షల విలువైన అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు వెంకటేశ్, స్వప్న, షాకీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది నాగిరెడ్డిపేట మండలం వదల్‌పర్తి గ్రామానికి సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఎల్లారెడ్డి మండలం రుద్రారం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణగౌడ్, గాంధారికి చెందిన ప్రవీణ్ గౌడ్ నిషేధిత అల్ప్రాజోలంను బైక్‌పై తరలిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నాగిరెడ్డిపేట మండలం మాసాన్‌పల్లికి చెందిన సిద్ధిరామాగౌడ్, బాబాగౌడ్ సైతం ఉన్నట్లు గుర్తించి సిద్ధిరామాగౌడ్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ముగ్గురిని కామారెడ్డి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. బాబాగౌడ్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై నర్సింహచారి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాల సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న డీపీఎం రమేశ్ బాబు

రాజంపేట: మండలంలోని రాజంపేట గ్రామ సంఘాల సమీక్ష సమావేశాన్ని మండల అధ్యక్షులు లక్ష్మి, గ్రామ అధ్యక్షులు లలిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీపీఎం రమేష్ బాబు హాజరై మాట్లాడారు. మహిళా శక్తి కార్యక్రమంలోని 14 అంశాలను వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించాలని, అదే విధంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని సంఘ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏపీఎం సాయిలు, వీవోఏలు పాల్గొన్నారు.

గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ కమిటీలు



బీకేఎస్ ముస్తాపూర్ గ్రామ కమిటీ సభ్యులు

లింగంపేట(ఎల్లారెడ్డి): ముస్తాపూర్, పోతాయిపల్లి, ఎల్లారం గ్రామాల్లో శనివారం భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) గ్రామ కమిటీలను జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ముస్తాపూర్ అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా చిన్న కాంతం, ప్రధాన కా ర్యదర్శిగా అశోక్, 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. పోతాయిపల్లి అధ్యక్షుడిగా ఆకుల సాయిరాం, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి గా భూమయ్య, ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నా రు. ఎల్లారం అధ్యక్షుడిగా ప్రభులింగం, ఉపాధ్యక్షుడిగా నడ్పి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా ప ట్లోళ్ల సంగయ్య, ముగ్గురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నేతలు సాయిరెడ్డి, సురేందర్, రాజేశ్వర్‌రావు, మచ్చ సాయిలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అప్పులు తీర్చేందుకు చైన్ స్నాచింగ్

- ఇద్దరి అరెస్ట్, రిమాండ్




వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై అనిల్

మాచారెడ్డి: జల్సాల కోసం చేసిన అప్పులను తీర్చేందుకు చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఈ నెల 2వ తేదీన గజ్యానాయక్ తండాలో నివాసముంటున్న పందిరి రాజవ్వ ఇంట్లోకి వెళ్లిన ఓ మహిళ ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఘన్‌పూర్‌కు చెందిన మ్యాడం సంతోష్, కృష్ణాజివాడికి చెందిన గుడిముందటి మానసను అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీకి పాల్పడింది తామేనని అంగీకరించారు. కామారెడ్డిలోని ఓ బట్టల దుకాణంలో పని చేస్తున్న సమయంలో పరిచయమైన వీరిద్దరు జల్సాల కోసం అప్పులు చేస్తూ వాటిని తీర్చేందుకు చోరీలకు పాల్పడుతున్నారన్నారు. శనివారం గజ్యా నాయక్ తండా చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పుస్తెల తాడును అమ్మేందుకు వెళ్తూ సంతోష్, మానస చిక్కారని, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల నుంచి ముగ్గురి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గౌతం నగర్ కు చెందిన రహీశాభాను అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లిన రహీశాభాను ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె సోదరుడు ఖాజా హుస్సేన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాక్లూర్‌కు చెందిన మహిళ..



భాగున్న

ఆర్మూర్: మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన భాగున్న అనే మహిళ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మతిస్థిమితం లేని భాగున్న ఈనె ల 11న ఉదయం 7గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా భాగున్న ఆచూకీ లభించలేదు. ఆమె సోదరుడు మర్ల లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మల్లయ్యపల్లికి చెందిన యువతి

ఎల్లారెడ్డి: మండలంలోని మల్లయ్యపల్లికి చెందిన భూమా మహేశ్వరి (18) అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. తాము ఊరికి వెళ్లివచ్చేసరికి మహేశ్వరి కనిపించడం లేదని, ఆమె కోసం పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెడికల్ షాపులో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓ మెడికల్ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గజానన్ మెడికల్ షాపు యజమాని బందేవార్ సంతోష్ శుక్రవారం రాత్రి 8.30గంటలకు దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూసే సరికి షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దుండగులు కౌంటర్‌లో నుంచి 1.18లక్షల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల విద్యుత్‌షాక్‌తో ఇద్దరు రైతులు మృతి

కామారెడ్డి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు రైతులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. గడ్డి కోస్తుండగా విద్యుత్ తీగకు కొడవలి తగిలి ఒకరు, బోరు మోటారు వద్ద సర్వీస్ వైరు చే యికి తగిలి మరొకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..

ఎల్లారెడ్డిపల్లిలో..



ఎల్లయ (ఫైల్)

రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన రైతు ముక్కిరి ఎల్లయ్య(41) శనివారం గుండారం గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో బోరుమోటార్ వద్ద గడ్డిని కోస్తుండగా కొడవలి విద్యుత్‌తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

ధర్మారెడ్డి శివారులో..



జోడు కృష్ణ(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు కృష్ణ(40) శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత ఇంటి ముందున్న పొలంలోకి వెళ్లి తిరిగిరాలేదు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు వెతుకగా జోడు రాములు అనే వ్యక్తి పొలంలోని బోరుమోటారు వద్ద సర్వీసు వైరు అతని కుడి చేయికి తగిలి అక్కడికక్కడే మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య జోడు సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలోపడి మృతి



గాండ్ల అశోక్(ఫైల్)

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన గాండ్ల అశోక్(32) ప్రమాదవశాత్తు కాకతీయకాలువలో పడి మృతి చెందాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రెండు రోజుల క్రితం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిన అశోక్ తిరిగి రాలేదు. దీంతో పలుచోట్ల కుటుంబ సభ్యులు వెతికారు. శనివారం ఉదయం కాకతీయ కాలువ ఒడ్డున బైక్ ఉన్న ప్రదేశంలో నీటిలో వెతుకగా అశోక్ మృతదేహం లభించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కాంగ్రెస్ కార్యకర్త అయిన అశోక్ మృతికి ఆ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. అశోక్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

చెరువులో మునిగి పశువుల కాపరి..

రుద్రూర్: గేదెల కోసం చెరువులోకి దిగిన పశువుల కాపరి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన పోతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని హంగర్గాకు చెందిన చాకలి పీరయ్య(50) గత కొన్నేళ్లుగా పశువుల కాపరిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం గేదెలు మేపడానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలిస్తుండగా చెరువు వద్ద పీరయ్య దుస్తులు కనిపించాయి. అప్పటికే చీకటిపడడంతో శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా పీరయ్య మృతదేహం లభించింది. చెరువులోకి దిగిన గేదెలను బయటకు కొట్టేందుకు నీటిలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని మృతుడి భార్య నర్సవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి..

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని రైతుఫారం గ్రామానికి చెందిన బొంకన్‌పల్లి సాయిలు (55) ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. సాయిలు గ్రామానికి చెందిన పోచన్నతో కలిసి ఇంద్రనగర్ గ్రామం రోడ్డు పక్కన ఉన్న చెట్టెక్కి కొమ్మలను నరికివేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

దుబాయిలో గుండెపోటుతో..



సున్నం రమేశ్(ఫైల్)

ఇందల్వాయి: మండల కేంద్రానికి చెందిన సున్నం రమేశ్(30) దుబాయిలో గుండెపోటుతో శుక్రవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సున్నం నర్సింలు, భారతవ్వ మూడో కుమారుడైన రమేశ్ ఎనిమిదేళ్లుగా దుబాయికి వెళ్తున్నాడని, చివరి సారిగా ఏడాదిన్నర క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లాడన్నారు. విషయం తెలుసుకున్న రమేశ్ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. రమేశ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహిళ మృతి చెందినట్లు ఎస్సై వెంకట్రావు శనివారం తెలిపారు. హాస్టల్‌లో ఉంటున్న కూతురి వద్దకు నవీపేట్ మండలం కోస్లికి చెందిన సంగీత(45) భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా సంగీత అక్కడికక్కడే మృతి చెందింది. బాధితకుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆవిరైన ఆశలు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- కొద్ది రోజుల్లో దుబాయి వెళ్లాల్సి ఉండగా ఘటన



నరేశ్ మృతదేహం

నవీపేట: చాలీచాలని సంపాదనతో బతుకీడుస్తున్న ఆ యువకుడు త్వరలోనే తన కష్టాలు దూరమవుతాయని, దుబాయికి వెళ్తున్నానని సంబురపడ్డాడు. కానీ తానొకటి తలిస్తే విధి మరొకటి తలచింది. రోడ్డు ప్రమాదం అతడిని బలితీసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అబ్బాపూర్(ఎం)కు చెందిన కదం నరేశ్ ఎడపల్లి మండలంలోని జానకంపేట పర్మిట్ రూమ్‌లో పని చేసేవాడు. చాలీచాలని వేతనంతో భార్య, కొడుకు పోషణ భారం కావడంతో దుబాయికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. దీనికోసం తెలిసిన వారి వద్ద అప్పు చేసి నిజామాబాద్‌కు చెందిన ఏజెంట్‌కు రూ.65 వేలు చెల్లించాడు. 13న వీసా రావడంతో మరో రూ. 20వేలు చెల్లించాలని ఏజెంట్ సూచించాడు. డబ్బుల కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్నేహితుల వద్దకు వెళ్లిన నరేశ్.. తిరుగు ప్రయాణంలో జానకంపేటలోని స్నేహితుల వద్ద కొద్దిసేపు ఆగాడు. టికెట్ కొనుగోలు చేసి కొద్ది రోజుల్లోనే దుబాయికి వెళ్తానని వారికి చెప్పాడు. ఇంటికి రాకపోవడంతో అదే సమయంలో నరేశ్‌కు అతడి భార్య లత ఫోన్ చేయగా, స్నేహితులతో ఉన్నా.. వస్తానని సమాధానం చెప్పాడు. తిరిగి 10గంటల సమయంలో ఆమె నరేశ్‌కు ఫోన్ చేయగా సమాధానం లేకపోవడంతో భయపడి తన బావ అరుణ్, చిన్న మామ గంగాధర్‌కు విషయం చెప్పింది. వారు జానకంపేటకు వెళ్లి విచారించగా అక్కడ లేకపోవడంతో బాసర రోడ్డు వెంబడి వెతుకుతుండగా జగ్గారావు ఫారం సమీపంలో బైక్ డివైడర్‌ను ఢీకొని పడిపోయింది. పక్కన పొదల్లో పడి ఉన్న నరేశ్‌ను చూసిన వారు.. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఏదైనా జంతువును తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నట్లు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.